# తెలుగు వన్ డాట్ కాం లో శ్రీమతి శోభానాయుడు గారి ఇంటర్వ్యూ

## నేర్చిన కళకు వన్నె తెచ్చిన "శోభ'

### శోభానాయుడుతో ఇంటర్వ్యూ

జీవితాన్ని కళగా చేసుకుని, కళనే ఊపిరిగా మలచుకుని దాని కోసమే నిరంతరం పరితపించే, పరిశ్రమించే వారు కొందరే ఉంటారు. ఆ వాసనలు పసితనంలోనే తెలుస్తాయి. బుడిబుడి నడకల్లోనే ఆ లయబద్ధమైన సవ్వడి వినిపిస్తుంది.....భావాలు ఉప్పొంగుతాయి......వాళ్ళను గుర్తిస్తే.....ప్రభంజనంలా ఉండే ప్రతిభతో ఎగసి ఆకాశాన్నందుకునే ప్రయత్నం చేస్తారు. ఆ కోవకు చెందిన వారే **శోభానాయుడు**. . . . .

ఆమెలోని ప్రతిభను గమనించి.....వెలికితీసి.....శిల్పంగా మలచడంలో ఎన్ని కష్టాలు అవాంతరాలు ఎదురైనా వెనక్కుతగ్గకుండా, ప్రోత్సహించి వెన్నుదన్నుగా నిలబడిన "మాతృమూర్తి వల్లనే ఈనాడు ఆమె ఆంధ్రదేశంలో కూచిపూడి నృత్యంలో "నెంబర్‌వన్' గా నిలబడగలిగారు శోభ. దేశ విదేశాల్లో

ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి, ఎన్నో అవార్డులు, పురస్కారాలు అందుకున్న కళామతల్లి ముద్దుబిడ్డ శోభానాయుడుతో రుబీనా పర్వీన్ ముఖాముఖి...

మీ బాల్యం గురించి వివరిస్తారా?

**శోభానాయుడు** :– నేను అనకాపల్లిలో పుట్టాను. నాకు ఇద్దరు అన్నయ్యలు అక్క, చెల్లి. అమ్మ సరోజినీదేవి మంచి సంగీత విద్వాంసురాలు. నాన్న వెంకన్న నాయుడు గారు ఇంజనీరు. ఆయన ఉద్యోగరీత్యా ఎన్నో ఊళ్ళు తిరిగాం. నా ఐదవ ఏట రాజమండ్రి వచ్చాం. చాలా చిన్నప్పుడే పాట కనుగుణంగా లయబద్ధంగా అడుగులు వేసేదాన్నట. అందుకే నాకు నాట్యం నేర్పించి మంచి నర్తకిని చేయాలని అమ్మ ఆశయం.

మీరీ స్థాయికి చేరుకోవడానికి ఎలాంటి శిక్షణ పొందారు?

మొదట నేను పి.ఎల్ రెడ్డిగారి దగ్గర నాట్యం నేర్చుకున్నాను. ఆ తర్వాత వెంపటి చిన సత్యం గారి వద్ద నేరుచుకున్నాను. మా నాన్నగారికి తరచూ బదిలీలు అవడం వల్ల మద్రాస్‌లో మా తాతగారింట్లో కొన్నాళ్ళుండి నృత్య సాధన చేసాను. నా క్లాస్ తాతగారింటికి చాలా దూరం అవడం వల్ల దగ్గర్లో నేను, అమ్మా

ఒక ఇల్లు తీసుకుని ఉన్నాం. అక్కడ 12 సంవత్సరాలు నాట్యం నేర్చుకున్నాను. నా కోసం కుటుంబాన్నంతా వదిలి అమ్మ నా దగ్గరే ఉండేది నాన్న వాళ్ళ నలుగురిని చూసుకునేవారు. ఒక రకంగా కుటుంబమంతా నా కోసం త్యాగం చెసారనే చెప్పాలి.

నా నాట్యం ప్రదర్శనలకు ఇప్పటిలోలా అప్పట్లో సౌకర్యాలు లేవు. అగ్గిపుల్లతో కనుబొమ్మలు గీసి, అన్ని ఆభరణాలు, వస్తువులు స్వయంగా చేసి అలంకరించేది అమ్మ. నేను ఐదవ ఏట నుండే ప్రదర్శనలు ఇవ్వడం మొదలు పెట్టాను. ఒక్కోసారి అనుకున్న సమయానికి కాకుండా ఆలస్యంగా ప్రదర్శనలు మొదలయ్యేవి . నేను అప్పటికి చక్కగా నిద్రపోయేదాన్ని. అమ్మ నన్ను నిద్ర నుండి లేపి స్టేజిపైకి పరేపది. ప్రేక్షకులు నా నృత్యానికి ముగ్దులై మళ్ళీ మళ్ళీ అని అరిచేవారు. చిన్ననాటి ప్రదర్శనలు, అమ్మ ప్రోత్సాహం గుర్తొస్తే తన్మయత్వం కలుగుతుంది.

ఆడపిల్లలను స్కూల్‌కి పంపాలంటేనే భయపడే రోజులు కదా అవి! బంధువర్గాల నుండి ఎలాంటి అభ్యంతరాలు ఎదురుకాలేదా?

ఎందుకు రాలేదు. బంధువులలో చాలా మంది ఇంటావంటా లేని డాన్సు మనకెందుకని అభ్యంతర పెట్టేవాళ్ళు. అవన్నీ మా అమ్మానాన్న లెక్కచేయ్యకుండా నన్ను ప్రోత్సహించారు కాబట్టే ఈనాడు నేనీస్థాయికి చేరుకోగలిగాను. అందుకే అంటారేమో తల్లిదండ్రుల ఋణం తీర్చుకోలేనిదని.

నిరంతరం నృత్యం మీదే దృష్టిని నిలపడం వల్ల చదువుకు ఆటంకం కలిగేదా?

కలుగుతుంది కదా మరి! నా మూడు నాలుగు తరగతుల్లో కాస్త చదువు మీద శ్రద్ద తగ్గి చదువులో వెనుకబడ్డను. దాంతో నాన్నగారు గట్టిగా మందలించారు. అప్పట్నించి నేనెప్పుడూ చదువులో ఫస్టే! నా పదోక్లాసుల్లో జిల్లా మొదటి ర్యాంకు వచ్చినందువల్ల బంగారు పతకం వచ్చింది. అప్పుడు నాన్నగారు చాలా సంతోషించారు. ఆ తర్వాత రెగ్యులర్‌గా చదవడం కుదరక ప్రైవేటుగా డిగ్రీ పూర్తిచేసాను.

**నృత్యానికి  మీ చిన్నప్పుడు ఎలాంటి  అవకాశాలు వుండేవి? ఇప్పుడెలా ఉంది?**

నా  చిన్నప్పుడు చాలా  ప్రోత్సాహం ఉండేది.  అప్పుడు ఒక అమ్మాయి బాగా  చేసిందీ అంటే  అవకాశాలు అలా వచ్చేసేవి. కాని ఇప్పుడు పరిస్థితి అలా  లేదు. మీడియా  సినిమాల వల్ల శాస్త్రీయ నృత్యానికి  ఆదరణ తగ్గింది.  నేర్చుకున్న వారికి అవకాశాలు  అంతగా రావడం లేదు.  ఏదో మాలాంటి వాళ్ళం  ఈ కళను సజీవంగా  ఉంచాలని అలా లాక్కొస్తున్నాం!

**మీకు  చాలా సినిమా ఛాన్సులు  వచ్చాయని విన్నాను.....**

మద్రాసులో  ఉన్నప్పుడు నాకు సినిమా  ఛాన్సులు వచ్చాయి. సినిమాల్లోకి వెళ్తే  పేరు,  డబ్బు వస్తాయి  కాని నాకు ఆ పేరు, డబ్బు సంపాదింలనే  కోరిక లేదు. శాస్త్రీయ  నృత్యంలో పేరు , డబ్బు  సంపాదించే అవకాశం  లేకపోయినా ఆత్మానందం ఉంటుంది. నృత్యంలో  లీనమై భగవంతుడ్ని  దర్శిస్తూ,  భక్తిలో మమేకమై పోవచ్చు.  మనకు తెలిసిన  విద్యను నలుగురికీ  నేర్పి సంతృప్తిని పొందవచ్చు.  అందువల్ల నేను  సినిమా ఛాన్సులు వదులుకున్నాను.

మీరు స్థాపించిన కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ గురించి వివరిస్తారా!

కూచిపూడి ఆర్ట్స్ అకాడడమీ 1980లో స్థాపించాము. వందలాది మంది విద్యార్థులు ఇక్కడా శిక్షణ పొందారు. చాలా మంది విద్యార్థులు విదేశాలకు వెళ్ళిపోయారు. దాదాపు 20 మంది మంచి గుర్తింపు పొంది రాణిస్తున్నారు. తమిళనాడులో భరతనాట్యం ఎలా నిలబడిందో ఆంధ్రప్రదేశ్‌లో కూచిపూడి నిలబడాలని ఆశయం, ఆ లక్ష్యంతోనే ఈ అకాడమీ స్థాపించాను.

ఈ మధ్య మీరు నృత్యనాటికలను ప్రదర్శిస్తున్నారు కదా! దానికి కారణం ఏమిటి భవిష్యత్తులో నృత్య నాటికలకు ఆదరణ పెరిగే అవకాశం ఉందా!

నృత్య నాటిక నుండే కూచిపూడి పుట్టింది. ఇందులో నంబర్ ఆఫ్ క్యారెక్టర్స్, కథ ప్రధానంగా ఉండడంవల్ల ప్రేక్షకులకు ఇంట్రస్టింగ్‌గా ఉంటుంది. నృత్య నాటికల ప్రదర్శన చాలా ఖర్చుతో కూడుకున్నది భవిష్యత్తులో ఎలా ఉంటుందో చెప్పలేం.

ఇప్పటివరకు ఎన్ని నృత్య నాటికలు చేసారు?

11 నృత్యనాటికలు చేసాం.

మీ  వ్యక్తిగ జీవితం........

నాకు  పెళ్ళైంది. పిల్లలు  లేరు. నాభర్త  పంచాయితీ రాజ్‌లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా  పని చేస్తున్నారు.

వైవాహిక  జీవితం నాట్యానికి  ఎప్పుడూ అడ్డుకాలేదా?

అలాంటి  పరిస్థితి ఎప్పుడూ ఎదురుకాలేదు.  మొదట్లో తల్లిదండ్రుల సపోర్ట్ కొంతకాలం ఉంటుంది.  పెళ్ళి తర్వాత ఎలా  ఉంటుందోనని ఇన్‌సెక్యూర్‌గా  ఫీల్ అయ్యేదాన్ని.  కాని పెళ్ళి తర్వాత  కూడా "నా భర్త నా ప్రిన్సిపుల్స్  కు అంగీకరించి సహకరించారు.  ఆయన నన్నెంతో  ప్రోత్సహిస్తారు.

ఇన్నేళ్ళ  నాట్య జీవితంలో  మరిచిపోలేని  అనుభవం.....

మరిచిపోలేని  అనుభవాలు అంటే  చాలా ఉన్నాయి......ఒకసారి అమ్మవారు  (చికెన్‌ఫాక్స్) వచ్చినప్పుడు  కూడా వరుసగా తొమ్మిది రోజులు  తొమ్మిది ప్రోగ్రామ్స్  చేశాను. ముఖంపై  బొబ్బలు ఉండడం  వల్ల మేకప్ అంటేది  కాదు. ఇంత మందాన  వేయాల్సి

వచ్చేది . అయినా సరే ఆర్గనైజర్స్ ఇబ్బంది పడకూడదనే చేసాను. ఇలాంటి అనుభవాలు కోకొల్లలు.

## యువకళాకారులకు మీరేం సందేశం ఇస్తారు!

త్వరగా నేర్చేసుకుని ప్రోగ్రామ్స్ ఇవ్వాలనే తపన ఇప్పటి వారిలో కనిపిస్తోంది. కాని నెమ్మదిగా నేర్చుకుంటేనే దాని ఫలితాలు ఎక్కువ కాలం నిలుస్తాయి. నృత్యంలో పాశ్చాత్య సంస్కృతిని దగ్గరకు రానీయకూడాదు. కనీసం నేర్చుకునే నాట్యానికి సెకండరీ ఇంపార్టెన్స్ అయినా ఇవ్వాలి. నేర్చుకున్న కళను వదిలేయకుండా నలుగురికీ చెప్పడం మంచిది.

## సాధించిన పురస్కారాలు

1. నారిత్య చూడామణి -కృష్ణ గాన సభ మద్రాసు

2. కేంద్ర సంగీత నాట్క కళా అకాడమి అవార్డు -1991

3. నారిత్య విహార్ - శ్రీ శ్రింగార సన్సద్ ఆఫ్ బోంబాయి -1992

4. నారిత్య కళాశిరోమణి - 1996

5. హంస అవార్డు రాష్ట్ర ప్రభుత్వంచే ఇటీవల బహుకరించబడింది.